దోమలను నియంత్రిస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు

కూకట్‌పల్లి జోన్ డీఎంహెచ్ఓ డా. రామ్‌కుమార్



బాలానగర్: ప్రజా ఆరోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలు అని కూకట్‌పల్లి జోన్ డీఎంహెచ్ఓ డాక్టర్ రామ్‌కుమార్ అన్నారు. గురువారం బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవంను పురస్కరించుకొని వైద్య ఉద్యోగులు, సిబ్బంది అవగాహన ర్యాలీని వినాయక్‌నగర్, రాజు కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్ మట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, దోమల నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలను నియంత్రిస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు. వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ చంద్రకళ, మలేరియా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన

కూకట్‌పల్లి: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం మూసాపేట సర్కిల్ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో మూసాపేట సర్కిల్ ఉపకమిషనర్ రమేష్, కూకట్‌పల్లి సర్కిల్ ఉపకమిషనర్ కృష్ణయ్య, ఎస్‌డబ్ల్యూఎం ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ ర్యాలీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నుంచి బయలుదేరి వివిధ కాలనీల్లో దోమల నివారణ, వాటి నుంచి వచ్చే వ్యాధులుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ నగేష్ తిప్పర్తి, ఈఎఫ్ఏలు మహేందర్‌రెడ్డి, ఉదయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు సంవత్సర కేలండర్ ఆవిష్కరణ



మోతీనగర్: ఆంగ్లం మోజులో పడి నేటి విద్యార్థులకు తెలుగు సంప్రదాయం, పండుగలు, పద్ధతులు మర్చిపోతున్న తరుణంలో అవంతినగర్ తోటకు చెందిన సంక్షేమ సంఘం స్వచ్ఛమైన తెలుగు నూతన సంవత్సర కేలండర్‌ను రూపొందించారు. అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ స్వామి, సభ్యులు టీవీ సుబ్బారావు, సుభాష్ పాటిల్, రవీందర్ రెడ్డి, పి.సత్యనారాయణరెడ్డితో కలిసి గురువారం కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి తరం విద్యార్థులకు తెలుగు భాష పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తెలుగులో అవంతినగర్ తోట కాలనీకి సంబంధించిన సమాచారంతో పాటు కాలనీలో ఉన్న ఆలయాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ముద్రించామన్నారు. కేలండర్‌ను కాలనీ వాసులు అందరికి ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి మైనార్టీలు ఓట్లు వేసేలా చూడాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మీరాజ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మీరాజ్ నియమితులయ్యారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సలహా మేరకు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అధ్వర్యంలో ఈ ఎన్నికను కూకట్‌పల్లి నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఏజాజ్ చేపట్టారు. ఇందులో పూర్తి మద్దతు మీరాజ్‌కు ఉండటంతో నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మీరాజ్‌ను అభినందించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడికి మైనార్టీలు ఓట్లు వేసేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు నరేందర్‌గౌడ్ మక్కాల నర్సింగ్‌రావు, ఇర్ఫాన్, మేకల హరినాథ్, ఖాదీర్, స్టార్‌పాయింట్ ఖాజా తదితరులు ఆయనకు అభినందనాలు తెలిపారు.

అంతరాష్ట్ర నేరస్తుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు

కూకట్‌పల్లి: ఈజీ మనీకి అలవాటు పడి నగల దుకాణాల నుంచి ఎనిమిది బంగారు గొలుసులు చోరీ చేసిన అంతరాష్ట్ర నేరస్తుడుని కేపీహెచ్‌బీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి జిల్లాకు చెందిన బానోతు భాస్కర్ (21), బిల్డింగ్ మెటీరియల్ సప్లై చేస్తూ ఉంటాడు. ఇతను క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీ, మద్యం, విలాసాలకు అలవాటు పడి ఈజీగా మనీ సంపాదించాలనే లక్ష్యంతో దొంగతనాల బాటపట్టాడు. ఈనెల 3వ తేదీన నిందితుడు బానోతు భాస్కర్ కేపీహెచ్‌బీలోని లలితా జ్యువెలరీకి గొలుసు కొనేందుకు వెళ్లాడు. షాపులోని సేల్స్ గర్ల్ బంగారు గొలుసులను చూపించింది. ఒక గొలుసును తీసుకుని నచ్చిందని... దాని ధర ఎంత అని అడిగాడు. ఆమె రేటు లెక్కపెట్టే సమయంలో ఆమె దృష్టిని మరల్చి సుమారు 28.405 గ్రాముల బరువున్న రూ.2.10లక్షల విలువైన బంగారు గొలుసును దొంగిలించాడు.

- ఈ మేరకు లలితా జ్యువెలర్స్ నిర్వాహకులు కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వరరావు, మధుసూదన్ డీఐ, డీఎస్ఐ అబ్దుల్ సమద్, బాలానగర్, కేపీహెచ్‌బీ క్రైమ్ టీమ్ నిందితుడిని పట్టుకోవటంలో తీవ్రంగా శ్రమించి నిందితుడిని పట్టుకుని విచారించారు.
- వివిధ బంగారు దుకాణాల్లో మొత్తం 8 గొలుసులను దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడి వద్ద నుంచి 151.83 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.10లక్షలకు పైగా ఉంటుందని ఏసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి, నగలును స్వాధీనం చేసుకున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు నాన్ లోకల్

నేను లోకల్

- మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి
- మెట్రోలో ప్రయాణించి ప్రచారం చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



మెట్రోలో ప్రచారం చేసి బీఆర్ఎస్ అభ్యర్థితో బయటకు వస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



సమావేశంలో అభివాదం తెలుపుతున్నబీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వినూత్న ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్‌బీనగర్ నుంచి కూకట్‌పల్లి వరకు పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మెట్రోలో ప్రయాణికులను కలిసి బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని... హైదరాబాద్‌లో ఐటీ రంగంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

- ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... కొడంగల్‌లో ఓడిపోయిన రేవంత్‌రెడ్డిని మల్కాజ్‌గిరి ప్రజలు అభివృద్ధి చేస్తారని.. ఏదో మార్పు తీసుకొస్తారని గెలిపించారన్నారు. కానీ ఐదేళ్లలో ఒక్క రోజైనా మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలోని ప్రజల సమస్యలను తెలుసుకోలేదన్నారు. మళ్లీ మల్కాజ్‌గిరిలో ఆ పార్టీ వ్యక్తి పోటీలో నిలబడ్డారని తెలిపారు. కరీంనగర్ నుంచి వచ్చిన ఈటల రాజేందర్, చేవెళ్ల నుంచి వచ్చిన సునీతామహేందర్‌రెడ్డి ఇద్దరు నాన్ లోకల్ వారని పేర్కొన్నారు. ప్రజలు అలాంటి వారి మాటలు నమ్మొద్దన్నారు. మీకు దగ్గరలో ఉండే లోకల్ కావాలో.. మీకు దూరంగా ఉండే నాన్ లోకల్ కావాలో ఓటర్లు ఆలోచించాలని కోరారు. 25 ఏళ్లుగా ప్రజా జీవితంలో ఎన్నో సేవా కార్యక్రమాలు, బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించాలని విన్నవించారు.

నగరంలో విద్యుత్, తాగునీటి సమస్యలు

మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒకవైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధితో దేశంలోనే అగ్రగామిగా తెలంగాణను నిలిపిన చరిత్ర మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. హైదరాబాద్ మహానగరంలో మంచినీటి సమస్య కరెంటు సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని కేసీఆర్ పాలించిన తొమ్మిది సంవత్సరాల్లో ఏనాడైనా కరెంటు సమస్య మంచినీటి సమస్య ప్రజలకు కనబడిందా అని కాంగ్రెస్ నాయకులకు మాజీ మంత్రి మల్లా రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం తేలిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ. వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, దయానంద్, కంటోన్మెంట్ అభ్యర్థి నివేదిత, కార్పొరేటర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను మెజార్టీతో గెలిపించుకోవాలి



గాయత్రినగర్‌కార్యాలయంలో బూత్ స్థాయి కార్యకర్తలతో శ్రీనివాస్‌యాదవ్

మోతీనగర్: ప్రతి బూత్‌లో ప్రతి ఓటరును కలిసి కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించాలని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లోని పార్టీ కార్యాలయంలో బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పులిగోళ్ల శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన అల్లాపూర్ డివిజన్ బూత్‌స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పులిగోళ్ల శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ... ప్రతి కార్యకర్త వీర సైనికుడిలాగా పనిచేసి మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పనిచేసే ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో కష్టనష్టాలకోర్చి పనిచేసిన నాయకుడు ఈటల రాజేందర్ అని గుర్తు చేశారు. అదే విధంగా కరోనా విపత్తు సమయంలో ఆరోగ్య మంత్రిగా తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవ చేసిన మహా నాయకుడు రాజేందర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి త్రిలోక్, విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బొంత హరికృష్ణ, నాయకులు అంకిత్ పాల్గొన్నారు.

యూజీడీ కోర్సులకు అడ్మిషన్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. యూనివర్సిటీలోని బీఏ, బీఈడీ, బీఎస్సీ, బీకామ్ నాలుగు ఏళ్ళ ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు (ఐటీఈపీ) అభ్యర్థుల కోసం జాతీయ సాధారణ ప్రవేశ పరీక్ష (ఎన్‌సీఈటీ) ద్వారా కొత్త విద్యావిధానం -2020కి అనుగుణంగా అడ్మిషన్లుకు ఏర్పాట్లు చేశామన్నారు.అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఏలో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. బీఈడీ, బీఎస్సీ, బీకామ్ ఇంటిగ్రేటెడ్ కోర్సులలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే ఎన్‌సీఈటీలో సాధించిన స్కోర్‌ల ఆధారంగా అడ్మిషన్లు కల్పించడం జరుగుతుందని వివరించారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుందాం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



రిక్షాపుల్లర్స్‌కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు మద్దతుగా గురువారం వివేకానందనగర్ డివిజన్‌లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రచారంలో చేశారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి రిక్షాపుల్లర్స్ కాలనీతో పాటు పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కాసానిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ గెలుపును మాజీ సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, బస్తీల కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శివమ్మకాలనీ అసోసియేషన్ సభ్యులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలోని డ్రైనేజీ నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మ్యాన్‌హోల్ లోపల పగిలిపోయి మురుగు జామ్ అవుతున్న సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వీలైనంత త్వరగా మ్యాన్‌హోల్స్ లోపల వైపు సిమెంట్ ప్లాస్టింగ్ చేయిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షుడు కాయితి నరసింహులు, గౌరవ అధ్యక్షుడు ఎస్.సిద్దయ్య, జే.నరసింహ, రాచందర్, గిరి, మోజస్ తదితరులు పాల్గొన్నారు.



శివమ్మ బస్తీవాసులతో సమావేశమైన కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

పిల్లలకు చదువుతో పాటు క్రీడలు అవసరం

- జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్
- చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలి
- సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



కేపీహెచ్‌బీ ప్రారంభించిన సమ్మర్ క్యాంపులో చిన్నారులతో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, జెడ్‌సీ అభిలాష అభినవ్, క్రీడాకారిణి నైనా జైస్వాల్

కూకట్‌పల్లి: పిల్లలకు చదువతో పాటు క్రీడలు అవసరమని, పిల్లలు తమకు నచ్చిన క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. గురువారం నుంచి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో గ్రేటర్‌లోని క్రీడా మైదానాలలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపుల నేపథ్యంలో కేపీహెచ్‌బీలోని జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీహెచ్ఎంసీలో ఈ సంవత్సరం కూడా 44 క్రీడల్లో ప్రత్యేక సమ్మర్ కోచింగ్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. 6 నుంచి 16 ఏళ్ల బాలబాలికలలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు గురువారం నుంచి మే 31వ తేదీ వరకు ఈ వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. చదువుతో సతమతమయ్యే చిన్నారుల్లో మానసిక ఒత్తిడి తగ్గించి క్రీడలతో ఉపశమనం పొందే విధంగా ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామని అన్నారు.

- అదే విధంగా నగర ప్రజలు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. పిల్లలు తమ తల్లిదండ్రులతో ఓటు వేయించాలని కోరారు. అనంతరం స్పోర్ట్స్ మెటీరియల్‌ను పరిశీలించి క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్, టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి డా. నైనా జైస్వాల్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి,క్రీడాకారులు, కోచ్‌లు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏళ్లు గడిచినా..

అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే..



జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనం.. నిర్మించి 12 ఏళ్లు (ఫైల్)

రాయదుర్గం: అభివృద్ధి పనుల్లో జాప్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది.. నిధుల లేమి, నిర్లక్ష్యంతో నిలిచిపోయిన పనులు.. ఏళ్లు గడిచినా, కోట్ల రూపాయలు వెచ్చించినా తీవ్ర జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఈ అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందా...అని ప్రజలు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.


- గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి తండాలోని మినీ మహాప్రస్థానం పనులకు పదేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. పనులు మధ్యలో ఆగిపోయాయి.
- గోపన్‌పల్లితండాలో ఆధునిక తరహాలో మల్టీ పర్పస్ కమ్యూనిటీహాల్ కమ్ ఫంక్షన్‌హాల్ నిర్మాణంలో తీవ్ర జాప్యం నెలకొంది. పదేళ్ల క్రితం శంకుస్థాపన చేసి, ఇటీవలే ప్రారంభించినా ఇంకా పనులు పూర్తికాలేదు
- ఏడేళ్ల క్రితం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపో నుంచి నల్లగండ్ల, గోపన్‌పల్లి మీదుగా వట్టినాగులపల్లి వరకున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.కానీ ఇప్పటికీ పూర్తి కాలేదు.
- 2012లో శంకుస్థాపన చేసిన ఖాజాగూడ మినీ స్టేడియం పరిస్థితి ఇంతే. ఇండోర్ స్టేడియం నాలుగేళ్ల క్రితం ప్రారంభించినా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.
- ఇక ఔట్‌డోర్ స్టేడియం కూడా అభివృద్ధి చేయాలని తలపెట్టినా ఆ ప్రతిపాదన అలాగే ఉంది.
- గత ఏడాది రూ 3 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేసిన ఖాజాగూడ మినీ మహాప్రస్థానం తరహాలో నిర్మించదలచిన శ్మశాన వాటిక పనులు జరగడం లేదు.
- ఖాజాగూడలో ఆరేళ్ల క్రితం రూ.45 కోట్లతో ప్రారంభించిన 8 లేన్ల మోడల్ రోడ్డు కాస్తా ఆరు లేన్లకే పరిమితం చేసి ఇరువైపులా సర్వీస్ రోడ్డు, డ్రైనేజీ, డక్ట్ వంటివి ప్రతిపాదనలకే పరిమితం చేశారు.
- రాయదుర్గంలోని శ్మశానవాటిక అభివృద్ధి కోసం గత పదకొండేళ్ల క్రితం శంకుస్థాపన చేసినా, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ రూ.65 లక్షలతో శ్మశానవాటికలను ఆధునీకరిస్తామని చెప్పినా ఇప్పటికీ ఎలాంటి పనులు ప్రారంభించలేదు.
- ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా రూ.50 కోట్లతో ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన వైట్‌టాపింగ్ రోడ్డు విప్రో సర్కిల్ వరకు ఒకవైపు మాత్రమే పూర్తి చేసి మిగతా పనులు, మరో వైపు చేయాల్సిన పనులు ఇప్పటికీ ఆరంభించలేదు.
- 2012లో కేశవనగర్‌లో రాజీవ్ ఆవాస్ యోజన గృహ నిర్మాణానికి శంకుస్థాపన, ఇళ్ల నిర్మాణానికి స్థల పరిశీలన చేసినా ఆచరణకు నోచుకోలేదు



ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో మరోవైపు వైట్ టాపింగ్ వేయని ప్రధాన రోడ్డు ఇదే...

- 12 ఏళ్ల క్రితం గౌలిదొడ్డి బ్లడ్ బ్యాంక్ పనులు కొంత వరకు చేసి నిలిపివేశారు.
- టీఎన్‌జీఓ కాలనీలో 8 ఏళ్ల క్రితం నిర్మించినా ఇప్పటికీ అందుబాటులోకి రాని మోడల్ మార్కెట్
- డివిజన్ పరిధిలో పలు చెరువుల సుందరీకరణకు శంకుస్థాపనలు చేసినా ఇప్పటి వరకు పనులు కూడా ప్రారంభం కాలేదు. కొన్నింటికి పనులు మొదలుపెట్టి మధ్యలో ఆపేశారు.


ప్రభుత్వం దృష్టికి తెస్తాం



గచ్చిబౌలి డివిజన్‌లో పెండింగ్ పనులన్నింటికీ నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తాం. గచ్చిబౌలి డివిజన్‌ను సమస్యలు లేని ప్రాంతంగా మార్చడమే లక్ష్యం. అవసరమైన నిధుల కోసం అన్ని విధాల చిత్తశుద్ధితో కృషి చేస్తాం.

– గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్, గచ్చిబౌలి డివిజన్

నిధులు మంజూరు చేయించేలా..



సమస్యను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళతాం. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయించేలా చూస్తాం.

– సాయిబాబా, మాజీ కార్పొరేటర్, గచ్చిబౌలి డివిజన్

27 నుంచి వేదాంత సభ

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారదా శంకరమఠంలో బ్రహ్మశ్రీ విశ్వనాథగోపాల కృష్ణశాస్త్రి అధ్యక్షతన 64వ శృంగేరి శారదాపీఠ సపరికరాద్వైత వే దాంత సభ ఈనెల 27 నుంచి 29 వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు మఠం కార్యనిర్వహణ అధికారి సీఎస్ఆర్ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు ధార్మిక ప్రవచనం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

29న నిధి ఆప్‌కే నికత్

మూసాపేట: కూకట్‌పల్లిలో ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయంలో నిధి ఆప్‌కే నికత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ తెలిపారు. ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లిలో ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో, నాసెన్స్ లాబ్ ప్రైవేట్ కంపెనీ, జీడిమెట్లలో ఉంటుందన్నారు. ఖాతాదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవటమే కాకుండా సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. కూకట్‌పల్లి, మియాపూర్ లింగంపల్లి, బీహెచ్ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్‌ల ఖాతాదారులు పాల్గొనవచ్చని తెలిపారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను మెజార్టీతో గెలిపించాలి

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఓటర్లను అభ్యర్థించారు. గురువారం శ్రీపంచముఖ అభయాంజనేయస్వామి ఆలయంలో కాసాని జ్ఞానేశ్వర్ విజయం సాధించాలని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, శ్రేయోభిలాషులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.